IslamHouse.com

Osoul Center
www.osoulcenter.com



Telugu
تلغــو

# కుటుంబ ఐకమత్యం

## طبيعة التماسك الأسرى

# طبيعة التماسك الأسري

ترجمة

كريم الله

مراجعة

نذير احمد

తెలుగు

Telugu

تلغو

مركز أصول
Osoul Center
www.osoulcenter.com

This book has been conceived, prepared and designed by the Usool International Centre. All photos used in the book belong to the Usool Centre. The Centre hereby permits all Sunni Muslims to reprint and publish the book in any method and format on condition that 1) acknowledgement of the Usool Centre is clearly stated on all editions; and 2) no alteration or amendment of the text is introduced without reference to the Usool Centre. In the case of reprinting this book, the Centre strongly recommends maintaining high quality.

+966 504 442 532
+966 11 445 4900
+966 11 497 0126
P.O.BOX 29465 Riyadh 11457
osoul@rabwah.com
www.osoulcenter.com

بسم الله الرحمن الرحيم

# విషయ సూచిక


| | |
|---|---|
| కుటుంబ ఐకమత్యం | 9 |
| తల్లిదండ్రులు | 15 |
| జీవిత భాగస్వామి | 21 |
| భార్యా భర్తల హక్కులు | 25 |
| సంతానం | 35 |
| ఇతర బంధువులు | 39 |

ఖుర్ఆన్ లో అల్లాహ్ అవతరింపజేసిన ఈ క్రింది వచనాలతో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తరుచుగా తన ప్రసంగాన్ని మొదలు పెట్టేవారు:

"ఓ మానవులారా! ఆదిమానవుడి నుండి మిమ్ముల్ని సృష్టించిన మీ ప్రభువుకు విధేయత చూపండి, అతని నుండి అతని భార్యను, వారిద్దరి నుండి అనేక మంది పురుషులను మరియు స్త్రీలను ఆయన సృష్టించాడు. ఎవరి ద్వారానైతే మీ పరస్పర హక్కులను డిమాండ్ చేస్తున్నారో, ఆ ప్రభువుకు భయపడండి మరియు మీ రక్తసంబంధాలను త్రెంచుకోకండి. నిశ్చయంగా, అల్లాహ్ ఎల్లప్పుడూ మిమ్మల్ని కనిపెట్టుకునే ఉంటాడు." (ఖుర్ఆన్ 4:1)

మొత్తం సమాజానికే కేంద్రబిందువు 'కుటుంబం'. ఒకవేళ కుటుంబం గట్టి పునాదిపై నిర్మించబడితే, సమాజం మొత్తం ఉత్తమ సమాజంగా నిర్మించబడే అవకాశం ఉంది. కాబట్టి వివాహం మరియు కుటుంబం వ్యవస్థలకు ఆదర్శపురుషుడూ, అంతిమ దైవప్రవక్తా అయిన ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చాలా ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. దీని గురించి ఖుర్ఆన్ లోని అల్లాహ్ దివ్యవచనాలు,

"నిశ్చయంగా, మీకంటే పూర్వం మేము సందేశహరులను

పంపాము మరియు వారికి భార్యలను మరియు సంతానాన్ని ప్రసాదించాము ...” (ఖుర్ఆన్ 13:38)

వివాహ వ్యవస్థను ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా తన జీవితంలో స్థాపించి చూపారు. ఆయన పలుకులలో:

“అల్లాహ్ సాక్షిగా, మీ అందరి కంటే ఎక్కువగా నేను అల్లాహ్ కు భయపడతాను మరియు దైవభక్తీ, ధర్మనిష్ఠాపరతా కలిగి ఉన్నాను; మరి, నేను ఉపవాసం ఉంటాను మరియు ఉపవాసం వదిలిపెడతాను కూడా, నమాజు (రాత్రి వేళల్లో) చేస్తాను మరియు పడుకుంటాను కూడా మరియు నేను స్త్రీలను కూడా పెళ్ళాడతాను. ఎవరైతే నా యొక్క ఈ సున్నతులను[1] వదిలి వేస్తారో, అలాంటివారు నాకు చెందినవారు కాదు.” (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)

నిస్సందేహంగా, కుటుంబ బంధుత్వం మరియు కుటుంబ ఐకమత్యం గురించి ఇస్లాం ధర్మం చాలా గంభీరంగా నొక్కి చెబుతున్నది. ఎవరైనా ఇస్లామీయ ధర్మశాసనాన్ని (షరిఅతును) క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే, వారు ‘మానవజీవితపు నిర్దిష్ట అవసరాలను స్థాపించడం, కాపాడటం, బలపర్చడం మరియు స్థిరపరచడమే’ దాని వెనుకనున్న అసలు వివేకమనే విషయాన్ని తేలిగ్గా కనిపెట్టగలరని ఇస్లామీయ ధర్మశాసన పండితులు పేర్కొన్నారు. ఇస్లామీయ ధర్మశాసనం గుర్తించిన మానవ జీవితపు కనీస నిర్దిష్ట అవసరాలు ఐదు. అవి:

---

1 సున్నతు: బోధనలు మరియు ప్రవక్త (స) యొక్క విధానం.

01 దీన్ - ధర్మం

02 నఫ్స్ - ప్రాణము

03 నసల్ - తరం, కుటుంబ వ్యవస్థ

04 అఖల్ - బుద్ధి, మతి

05 మాల్ - సంపద

ఉదాహరణకు – ఇస్లాం ధర్మం ఎంతో ప్రాధాన్యతనిస్తున్న కుటుంబ వ్యవస్థ గురించి అర్థం చేసుకోవాలంటే, కుటుంబ వ్యవస్థ పవిత్రతను కాపాడే ఖచ్చితమైన మరియు కఠినమైన ఇస్లామీయ చట్టాలను పరిశీలిస్తే చాలు. ఉదాహరణకు ఈనాడు "ఆధునిక పాశ్చాత్య దేశాలలో" కుటుంబ వ్యవస్థ యొక్క అసలు పునాదిపై దాడి చేస్తున్న వ్యభిచారం మరియు ఇతర అశ్లీల కార్యకలాపాలను మామూలు నేరాలుగా[1] కూడా పరిగణించటం లేదు. అయితే ఇస్లాం పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంది. పరస్పర మంచితనంతో మెలగటమే కాకుండా, వివాహ బంధానికి హాని

1 1969 లో, తన స్నేహితుడితో తమ భార్య పెట్టుకున్న అక్రమ సంబంధం గురించి ఫిర్యాదు చేసిన వ్యక్తితో 'నీ ఆలోచనలు పాత బడిపోయాయి, నీవిప్పుడు 1969లో నివసిస్తున్నావని గ్రహించు' అని ఆ ఇంగ్లీషు జడ్జి పలికాడు. [పూర్తి కథ యూసుఫ్ అల్‌ఆలిమ్, అల్ మఖాసిద్ అల్ ఆమ్మహ్ లి అల్ షరిఅహ్ అల్ ఇస్లామీయ (రియాద్ ఐ.ఐ.పి.హెచ్: International Islamic Publishing House, 1994), p. 397 లో ఉంది.] ఈనాడు ఇంట్లోని పిల్లలు తనకు చెందిన వారు కాదని భర్త నిరాకరించడం, తద్వార ఇద్దరి మధ్య వైరం పెరిగి, ఘర్షణలు మొదలై, వివాహబంధం నాశనమై పోవడం మామూలు విషయమై పోవడాన్ని మనం చూస్తున్నాం. భార్యాభర్తల మధ్య ఇలాంటి లెక్కలేనన్ని కేసులు కోర్టులలో ఉన్నాయి. "ఆధునిక & నాగరిక" వివాహబంధం ఇలా ఉంటుందా? అనే అసలు ప్రశ్న ఎవరికైనా రావచ్చు.

కలిగించే ప్రతి చెడు, అశ్లీల, వ్యభిచార మరియు మిశ్రమ సమావేశ కార్యకలాపాల దరిదాపులకు కూడా పోకూడదని ఇస్లాం ధర్మం కుటుంబ సభ్యులందరినీ నిర్దేశిస్తున్నది. దీని గురించి ఖుర్ఆన్ లోని అల్లాహ్ ఆదేశం ఇలా ఉన్నది:

"మరియు అక్రమ సంబంధాల దరిదాపులకు వెళ్ళవద్దు. నిశ్చయంగా, అది చాలా అసహ్యకరమైన కార్యం మరియు చెడ్డపని" (ఖుర్ఆన్ 17:32)

అయితే ఈ బోధనలు కేవలం ఆజ్ఞల వరకే పరిమితం కాలేదు. ఉపేక్షించబడకూడని కొన్ని ఘోరాతి ఘోరమైన చెడుపనులకు ఇస్లామీయ ధర్మచట్టం కఠినమైన శిక్షలు విధించింది. దీని గురించి ఖుర్ఆన్ లోని అల్లాహ్ ఆదేశాలు ఇలా ఉన్నాయి:

"వ్యభిచారం చేసిన (అవివాహిత) స్త్రీ, వ్యభిచారం చేసిన (అవివాహిత) పురుషుడు – ఉభయులలో ప్రతి ఒక్కరికీ వంద కొరడా దెబ్బలు కొట్టండి. మీరు అల్లాహ్ పై మరియు అంతిమదినంపై విశ్వాసం గలవారే అయితే వారిపై దైవాజ్ఞను (ఈ షరియతు శిక్షను) విధించేటప్పుడు మీరు ఎంత మాత్రం జాలి పడ కూడదు. పైగా వారిని శిక్షించే సమయంలో సాక్ష్యంగా ముస్లింలలో కొంతమంది అక్కడ ఉండాలి." (ఖుర్ఆన్ 24:2)

ఇతరులకు మంచి చేసే దిశ వైపు దయాదాక్షిణ్యాలు దారి చూపుతాయి. అయితే ఇలాంటి దోషులను శిక్షించడంలో దయ జూపకూడదు, ఎందుకంటే వీరిపై దయ జూపడమనేది ఇతరులకు మంచి చేసేలా వీరికి దారి చూపే బదులు, చెడు ఫలితాల వైపుకు మాత్రమే వీరిని పురిగొల్పుతుంది. ఇంకా, సహీహ్

బుఖారీ మరియు సహీహ్ ముస్లింలలో నమోదు చేయబడిన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వచనాలలో, ఒక వివాహిత వ్యభిచారికి రాళ్ళతో కొట్టి చంపే శిక్ష విధించినట్లు స్పష్టంగా ఉన్నది. వాస్తవానికి కుటుంబ నైతికతను కాపాడటంలో ఇస్లాం ధర్మం ఇంకొంచెం ముందుకు వెళ్ళింది: ఎవరైతే పతివ్రతలపై తప్పుడు అపనిందలు వేస్తారో, అలాంటి వారికీ కఠినశిక్ష విధించింది. దీని గురించిన అల్లాహ్ ఆదేశాలు:

"శీలవతులపై అపనింద మోపి, దానికి సంబంధించిన నలుగురు సాక్షుల్ని తీసుకురాలేని వారికి ఎనభై కొరడా దెబ్బలు కొట్టండి. ఇక మీదెన్నడూ వారి సాక్ష్యాన్ని ఆమోదించకండి. వారు అవిధేయులు." (ఖుర్ఆన్ 24:4)

ఇక్కడ గుర్తించవలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, కుటుంబ సభ్యులందరితో ప్రవర్తించవలసిన తీరు గురించి అల్లాహ్ మొత్తం మానవజాతికి దారి చూపుతున్నాడు. ఇది ఒక సంక్షిప్త వ్యాసం గనుక, కుటుంబ సభ్యులైన తల్లిదండ్రులు, పిల్లలు, భార్యలు మరియు ఇతర రక్తసంబంధీకులతో ఒక ముస్లిం ఎలా ప్రవర్తించాలనేది ఇక్కడ క్లుప్తంగా మాత్రమే చర్చించ బడుతున్నది.

# తల్లిదండ్రులు

వీలయినంత ఉత్తమంగా తన తల్లిదండ్రులతో ప్రవర్తించమని అల్లాహ్ ప్రజలను ఆదేశిస్తున్నాడు. తప్పకుండా ముస్లింలు విధేయత చూపాలి. ముందుగా వారు తమ ప్రభువుకు మరియు తమ అంతిమ ప్రవక్తకు తప్పక విధేయత చూపాలి. ఆ తర్వాత స్వంత తల్లిదండ్రులను మించి, వారి విధేయతకు యోగ్యులెవ్వరూ లేరు. అందువలననే ఖుర్ఆన్ లోని అనేక వచనాలు తల్లిదండ్రులను ఎలా గౌరవించాలనే విషయం గురించి నిర్దేశిస్తున్నాయి. వాస్తవానికి, అల్లాహ్ ఖుర్ఆన్ లో అనేక చోట్ల, కేవలం తనను మాత్రమే ఆరాధించాలనే ఆదేశాలతో పాటు తల్లిదండ్రులతో ఉత్తమంగా ప్రవర్తించాలనే ఆజ్ఞలనూ జారీ చేసాడు. ఉదాహరణకు, ఖుర్ఆన్ లోని క్రింది వచనాన్ని గమనించండి:

“అల్లాహ్ నే ఆరాధించండి. ఆయనకు సహవర్తులుగా ఎవరినీ సాటి కల్పించకండి. తల్లిదండ్రుల పట్ల ఉత్తమంగా ప్రవర్తించండి. బంధువుల పట్ల, అనాధల పట్ల, నిరుపేదల పట్ల, ఆత్మీయులైన ఇరుగు పొరుగువారి పట్ల, బంధువులు కాని ఇరుగు పొరుగు వారి పట్ల, ప్రక్కనున్న మిత్రుల పట్ల, బాటసారుల పట్ల, మీ ఆధీనంలో ఉన్న బానిసల పట్ల ఔదార్యంతో మెలగండి. అహంకారంతో విర్రవీగేవారిని, బడాయి కొట్టే వారిని నిశ్చయంగా అల్లాహ్ ఎంత మాత్రమూ ఇష్టపడడు.” (ఖుర్ఆన్ 4:36)

ఇంకా అల్లాహ్ ఇలా ఆజ్ఞాపించాడు:

“(ఓ ప్రవక్తా) ప్రకటించండి: రండి, మీ ప్రభువు మీపై నిషేధించిన వాటిని మీకు వినిపిస్తాను. అవేమంటే, అల్లాహ్ కు సహవర్తులుగా ఎవ్వరినీ సాటి కల్పించకండి, తల్లిదండ్రుల పట్ల ఉత్తమరీతిలో మెలగండి. పేదరికపు భయంతో మీ సంతానాన్ని హతమార్చకండి. మేము మీకూ ఆహారాన్నిస్తున్నాం, వారికీ ఇస్తాం. సిగ్గుమాలిన పనులు – అవి బాహాటంగా జరిగేవైనా, గోప్యంగా జరిగేవైనా – వాటి దరిదాపుల క్కూడా వెళ్ళకండి. చట్టబద్ధంగా తప్ప అల్లాహ్ నిషేధించిన ఏ ప్రాణినీ హతమార్చకండి. మీరు ఆలోచించి పని చేస్తారని, మీకీ విషయాలను గురించి అల్లాహ్ గట్టిగా తాకీదు చేస్తున్నాడు...” (ఖుర్ఆన్ 6:151)

“నీ ప్రభువు స్పష్టంగా ఇలా ఆజ్ఞాపించాడు: మీరు ఆయనను తప్ప మరొకరెవరినీ ఆరాధించకూడదు. తల్లిదండ్రుల పట్ల ఉత్తమంగా వ్యవహరించాలి. నీ సమక్షంలో వారిలో ఒక్కరు గాని లేదా ఇద్దరూ గానీ వృద్ధాప్యానికి చేరుకుంటే, వారి ముందు (విసుగ్గా) ఉఫ్ అని కూడా అనకూడదు. వారిని కసురుకుంటూ మాట్లాడకు. పైగా వారితో మర్యాదగా మాట్లాడు. అణుకువ, దయాభావం ఉట్టిపడే విధంగా నీ భుజాలను వారి ముందు అణిచి పెట్టు. “ఓ ప్రభూ! బాల్యంలో వీరు నన్ను (ప్రేమానురాగాలతో) పోషించినట్లే, నీవు వీరిపై దయజూపు” అని వారి కోసం ప్రార్థిస్తూ ఉండు. ఆంతర్యాలలో ఏముందో మీ ప్రభువుకు బాగా తెలుసు. మీరు గనుక మంచివారుగా మసలుకుంటే, అలా (మంచి వైపుకు) మరలి వచ్చే వారిని అల్లాహ్ క్షమిస్తాడు.” (ఖుర్ఆన్ 17:23-25)

“మేము ఇస్రాయీలు సంతతి నుండి వాగ్దానం తీసుకున్నాము: అల్లాహ్ ను తప్ప మరెవ్వరినీ ఆరాధించకూడదు మరియు తల్లిదండ్రుల పట్ల ఉత్తమంగా ప్రవర్తించాలి. బంధువులను, అనాధలను మరియు ఆగత్యపరులను ఆదరించాలి. ప్రజలతో మర్యాదగా మాట్లాడాలి....” (ఖుర్ఆన్ 2:83)

అల్లాహ్ కు అత్యంత ఇష్టమైన ఆచరణలను గురించి తెలుపుతూ, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిర్ణీత సమయంలో నమాజు చేయడం గురించి పేర్కొని, వెంటనే తల్లిదండ్రులతో ఉత్తమంగా ప్రవర్తించడం గురించి పేర్కొనడం దీని ప్రాధాన్యతను తెలుపుతున్నది: ఒక వ్యక్తి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఇలా ప్రశ్నించారు: “అల్లాహ్ కు అత్యంత ఇష్టమైన పని ఏది?” దానికి ఆయనిలా జవాబిచ్చారు, “నిర్ణీత సమయంలో చేసే నమాజు.” మరలా “ఆ తర్వాత ఏది?” అని ప్రశ్నించగా, ఆయనిలా జవాబిచ్చారు, “తన తల్లిదండ్రులకు విధేయత చూపడం...” (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)

సంతానాన్ని పెంచడంలో తల్లిదండ్రులు ముఖ్యంగా తల్లి పడే శ్రమను మరియు ప్రయాసను అల్లాహ్ విశ్వాసులకు గుర్తుచేసి, బదులుగా మీ యొక్క ప్రేమ, గౌరవం, కృతజ్ఞత మరియు విధేయత పొందేందుకు వారు అర్హులని తెలిపినాడు. దీని గురించి ఖుర్ఆన్ లోని అల్లాహ్ పలుకులు:

“లుఖ్మాన్ తన కుమారునికి హితబోధ చేస్తూ ఇలా అన్నాడు, ‘ఓ నా కుమారుడా! అల్లాహ్ కు భాగస్వామ్యం కల్పించకు. నిస్సందేహంగా అల్లాహ్ కు భాగస్వాముల్ని కల్పించడం

ఘోరమైన అన్యాయం. మరి మేము మానవునికి అతని తల్లిదండ్రుల విషయంలో గట్టిగా తాకీదు చేసాము. అతని తల్లి ప్రయాసపై ప్రయాసకు ఓర్చుకుంటూ అతడిని తన గర్భంలో మోసింది. తర్వాత అతని పాలను విడిపించడానికి రెండు సంవత్సరాలు పట్టింది. (కనుక, ఓ మానవుడా) నువ్వు నాకూ, నీ తల్లిదండ్రులకూ కృతజ్ఞుడవై ఉండు. (చివరికి) మరలి రావలసింది నా వద్దకే." (ఖుర్ఆన్ 31:13-14)

"మేము మనిషికి, తన తల్లిదండ్రుల పట్ల ఉత్తమరీతిలో ప్రవర్తించవలసినదిగా తాకీదు చేసాము. అతని తల్లి బాధను భరిస్తూ, గర్భంలో అతన్ని మోసింది. బాధను భరిస్తూనే అతన్ని ప్రసవించింది. అతన్ని గర్భంలో మోయటానికి, అతని పాలు విడిపించడానికి ముప్పై మాసాల వ్యవధి పట్టింది. తుదకు అతను పూర్తి పరిపక్వతకు అంటే నలభై ఏళ్ళ ప్రాయానికి చేరుకున్నపుడు ఇలా విన్నవించుకున్నాడు, 'నా ప్రభూ! నీవు నాపై, నా తల్లిదండ్రులపై కురిపించిన అనుగ్రహ భాగ్యాలకు గానూ కృతజ్ఞతలు తెలుపుకునే మరియు నీ ప్రసన్నతను చూరగొనే విధంగా సత్కార్యాలు చేసే సద్బుద్ధిని నాకు ప్రసాదించు. ఇంకా నా సంతానాన్ని కూడా సజ్జనులుగా తీర్చిదిద్దు. నేను నీ వైపునకే మరలుతున్నాను. నేను నీ విధేయులలో ఒకణ్ణి.'" (ఖుర్ఆన్ 46:15)

కాబట్టి, తన పిల్లల ప్రేమానురాగాలు మరియు దగ్గరితనం అందరి కంటే ఎక్కువగా పొందే అర్హత తల్లి కలిగి ఉన్నది. ఒకసారి ఒకవ్యక్తి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఇలా ప్రశ్నించారు: "నా ఉత్తమ సహచర్యంలో గడిపే హక్కు ప్రజలందరిలో ఎవరు అత్యంత ఎక్కువగా కలిగి ఉన్నారు?" దానికి ఆయనిలా

జవాబిచ్చారు, "నీ తల్లి." ఆ వ్యక్తి మరలా, "ఆ తర్వాత ఎవరు?" దానికి ఆయనిలా జవాబిచ్చారు, "నీ తల్లి." ఆ వ్యక్తి మరలా "ఆ తర్వాత ఎవరు?" అని ప్రశ్నించాడు. దానికి ఆయనిలా జవాబిచ్చారు, "నీ తల్లి." ఆ వ్యక్తి మరోసారి, "ఆ తర్వాత ఎవరు?" అని ప్రశ్నించగా, "నీ తండ్రి." అని ఆయన జవాబిచ్చారు, (సహీహ్ ముస్లిం)

# జీవిత భాగస్వామి[1]

ఇస్లాం ధర్మంలో వివాహమనేది చాలా ముఖ్యమైన కార్యక్రమం. స్త్రీపురుషుల మధ్య స్పష్టమైన సంబంధం ఉందనే విషయాన్ని ఖుర్ఆన్ తెలుపుతున్నది. మానవులందరూ ఒకే ఆదిమానవుడి నుండి ఉనికిలోని వచ్చారనే విషయాన్ని ఖుర్ఆన్ లో అనేక చోట్ల అల్లాహ్ మానవాళికి గుర్తు చేస్తున్నాడు. ఈ రక్తసంబంధాలలోనే వారు బంధించబడి ఉన్నారు. ఈ రక్తసంబంధాల ద్వారానే పరస్పర హక్కులు స్థాపించబడ్డాయి. ఖుర్ఆన్ లోని అన్నిసా అనే నాలుగవ అధ్యాయం ప్రారంభంలోని అల్లాహ్ పలుకులు:

"ఓ మానవులారా! మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించి, దాని నుంచే దాని జతను సృష్టించి, ఆ ఇద్దరి ద్వారా ఎందరో పురుషులను, స్త్రీలను వ్యాపింపజేసిన మీ ప్రభువుకు భయపడండి. ఎవరి పేరుతో మీరు పరస్పరం మీకు కావలసిన వాటిని అడుగుతారో ఆ అల్లాహ్ కు భయపడండి. రక్తసంబంధాల తెగత్రెంపులకు దూరంగా ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ మీపై నిఘా వేసి ఉన్నాడు." (ఖుర్ఆన్ 4:1)

1 వివాహ సంబంధమైన ఇస్లామీయ ధర్మాదేశాల గురించి మరింతగా తెలుసుకోవాలంటే ఇదే రచయిత వ్రాసిన,"The Fiqh of the Family, Marriage and Divorce" (American Open University, 1997), passim చూడండి. ఇక్కడ చర్చించబడిన విషయాలు ఆ పుస్తకంలోని వివిధ భాగాల నుండి తీసుకోబడినాయి.

స్త్రీపురుషులలో కామన్ గా ఉండే అనేక విషయాలతో పాటు, భార్యాభర్తల మనస్సులలో తను సృష్టించిన పరస్పర ప్రేమానురాగాలను తన యొక్క గొప్ప సూచనలుగా అల్లాహ్ పేర్కొంటున్నాడు. లోతుగా ఆలోచించే వారి కొరకు ఇవి గొప్ప సూచనలు. మరో మాటలో, అలా లోతుగా ఆలోచించేవారు సృష్టి యొక్క ఈ ప్రత్యేకతపై దృష్టి సారించి, అల్లాహ్ యొక్క శక్తిసామర్థ్యాలు, సృష్టి నిర్మాణంలో ఆయన పరిపూర్ణత్వం, ఈ ప్రపంచంలో ఆయన ఉంచిన సుభాలను, దయాదాక్షిణ్యాలను గుర్తుకు తెచ్చుకుంటారు. దీని గురించి ఖుర్ఆన్ లోని అల్లాహ్ పలుకులు:

"మరి ఆయన సూచనలలోనే ఒకటి ఏమిటంటే, ఆయన మీకోసం స్వయంగా మీలో నుంచే భార్యలను సృజించాడు. మీరు వారి వద్ద ప్రశాంతత పొందటానికి. ఆయన మీ మధ్య ప్రేమనూ, దయాభావాన్నీ పొందుపరిచాడు. నిశ్చయంగా, ఆలోచించేవారి కోసం ఇందులో ఎన్నో సూచనలున్నాయి." (ఖుర్ఆన్ 30:21)

ఇంకా, ఖుర్ఆన్ లోని అల్లాహ్ పలుకులు:

"ఆ అల్లాహ్ యే మిమ్మల్ని ఒకే ప్రాణి నుంచి పుట్టించాడు. మరి అతని నుండే అతని జంటను కూడా సృష్టించాడు. – అతనా జంట ద్వారా ప్రశాంతతను పొందటానికి. ఆ తర్వాత అతను తన సహధర్మచారిణితో సమాగమం జరుపగా, ఆమె ఒక తేలికైన భారం దాల్చింది (గర్భవతి అయింది). ఆమె ఆ భారాన్ని మోసుకుంటూ తిరిగేది. మరి భారం అధికమైనపుడు, భార్యాభర్తలిద్దూ తమ ప్రభువైన అల్లాహ్ ను, "నీవు గనుక మాకు ఏ లోపమూ

లేని బిడ్డను ప్రసాదిస్తే, మేము నీకు తప్పకుండా కృతజ్ఞులమై ఉంటామని" ప్రార్థించసాగారు. ...” (ఖుర్ఆన్ 7:189)

కాబట్టి, ఖుర్ఆన్ ప్రకారం భార్యాభర్తల మధ్య ఉండవలసిన బంధం ప్రేమానురాగాలు, దయ మరియు పరస్పర అవగాహనలతో నిండినదై ఉండవలెను. అంతేగాక తన భార్యలపై దయ చూపమని అల్లాహ్ పురుషులను ఆజ్ఞాపిస్తున్నాడు:

“...వారితో ఉత్తమరీతిలో కాపురం చేయండి. ఒకవేళ వారు మీకు నచ్చకపోతే బహుశా ఏదో ఒక్క విషయం మూలంగా మీకు నచ్చి ఉండక పోవచ్చు. కానీ మీకు నచ్చని ఆ విషయంలోనే అల్లాహ్ అపారమైన శుభాన్ని పొందుపరచాడేమో.” (ఖుర్ఆన్ 4:19)

ఇస్లాం ధర్మంలో వివాహ వ్యవస్థ యొక్క అసలు ఉద్దేశ్యానికి సంబంధించిన కొన్ని విషయాలను ఇక్కడ చర్చించవలసిన అవసరం చాలా ఉంది. ఎందుకంటే, దాంపత్య జీవితంలోని పాత్ర గురించి మరియు వివాహ వ్యవస్థ గురించి అసలేమీ అవగాహన లేకుండానే అనేక మంది పెళ్ళాడతారు లేదా పెళ్ళి చేసుకోవాలనే కోరికతో ఉంటారు. కాబట్టి, పెళ్ళి తర్వాత తమ భుజస్కంధాలపై వచ్చి పడే బాధ్యతల గురించి వారు గ్రహించరు. అయితే ఒకవేళ ముందుగానే వివాహ వ్యవస్థ యొక్క ఉద్దేశ్యం మరియు వివాహంతో పాటు వచ్చే బాధ్యతల గురించి గనుక తెలుసుకుంటే, వారి పెళ్ళి సాఫల్యమయ్యే అవకాశాలు పెరుగుతాయి. తన నుండి ఆశించబడుతున్న బాధ్యతలు మరియు కర్తవ్యాల్ని గురించి ఆ వ్యక్తి క్షుణ్ణంగా గ్రహిస్తాడు.

ఇస్లాంలో వివాహ వ్యవస్థ యొక్క అసలు ఉద్దేశ్యం కేవలం

సరదా లేక పాశవిక కామావేశం తీర్చుకోవడం ఎంత మాత్రమూ కాదు. వాటి కంటే వివాహ వ్యవస్థ ఎన్నో రెట్లు ఉన్నతమైంది.

## వివాహ వ్యవస్థ వెనుకనున్న కొన్ని ముఖ్యోద్దేశాలు[1]:

సంతానం, ధర్మబద్ధంగా శారీరక సుఖం అనుభవించడం, వ్యక్తిగతంగా పూర్తి పరిపక్వత పొందటం, ఈ ప్రాపంచిక జీవితం గడపడంలో పరస్పర తోడ్పాటు, అనేక మానసిక మరియు శారీరక ప్రయోజనాలు పొందడం, ఒక ఉత్తమ సమాజం కొరకు పునాది రాయి కావడం, రాబోయే తరాన్ని నైతికత మరియు ఆధ్యాత్మికతలతో కూడిన మంచి క్రమశిక్షణతో పెంచడం, ప్రజలను మరియు వంశాలను ప్రేమానురాగాలలో బంధించడం మొదలైనవి.

1 Cf., అబ్దుల్ రహ్మాన్ అబ్దుల్ ఖాలిఖ్, Al-Zawaaj fi Dhill al-Islaam (కువైట్: al-Daar al-Salafiyyah, 1988), pp. 21ff.

# భార్యాభర్తల హక్కులు

దాంపత్య జీవితం విజయవంతం కావాలంటే, భార్యాభర్తలిద్దరూ పరస్పర హక్కులను, బాధ్యతలను, కర్తవ్యాలను పూర్తిగా అర్థం చేసుకోవలసి ఉంది.  అందువలన ఇస్లామీయ ధర్మశాస్త్రంలో భార్యాభర్తల పరస్పర హక్కులు మరియు కర్తవ్యాల గురించి చాలా స్పష్టంగా, వివరంగా తెలుపబడింది. అంతేగాక తమ జీవిత భాగస్వామి కూడా ముస్లిమే అనే విషయాన్ని ప్రతి భర్తా మరియు భార్యా తప్పకుండా గ్రహించవలసి ఉంది. తన జీవితభాగస్వామి కూడా ఇస్లాం పరంగా తనకు సోదరుడు లేక సోదరే కదా. కాబట్టి, ఒక ముస్లింకు ఉండే సాధారణ సౌభ్రాతృత్వ హక్కులన్నీ ఆ జీవిత భాగస్వామికి కూడా ఉంటాయి. ఒక ముస్లిం యొక్క ప్రవర్తన, సౌభ్రాతృత్వం, పరస్పర ప్రేమానురాగాలు మరియు విధేయత మొదలైన అంశాల గురించి అనేక పుస్తకాలు ప్రచురించబడినాయి. పెళ్ళాడిన భర్త మరియు భార్యలు కూడా ఇస్లామీయ జీవన విధానంలోని భాగమే కాబట్టి, ఆ యా నియమాలన్నీ వారిపై కూడా వర్తిస్తాయి. అంతేగాక, తన ఉపదేశంలో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడా దీనిని ఇలా నొక్కి వక్కాణించారు: “దేనినైతే తన కోసం ఇష్టపడతాడో, దానినే తన సోదరుడి కోసం కుడా ఇష్టపడనంత వరకు మీలో ఎవ్వరూ నిజమైన విశ్వాసులు కారు.” (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)

అలాగే, ఇరువురి మధ్య జరిగిన నిఖా ఒడంబడిక ప్రకారం, భార్యకు తన భర్తపై కొన్ని ప్రత్యేక హక్కులు లభిస్తున్నాయి.[1]

కాబట్టి, భార్యాభర్తల హక్కుల గురించి చర్చించేటప్పుడు, దీనిని కేవలం ధర్మ చట్టాలకే పరిమితమైన విషయమని భావిస్తూ, తేలిగ్గా తీసుకోకూడదు. భార్యాభర్తల మధ్య ఉండవలసిన బంధాన్ని ఇద్దరూ తప్పకుండా గౌరవించాలనేది ధర్మ చట్టాలలో నిర్దేశించబడిన దాని కంటే ఎంతో ఎక్కువ గంభీరమైనది. అది ప్రేమానురాగాలతో, పరస్పర అవగాహన మరియు తోడ్పాటుతో కూడిన గట్టి బంధం. భార్యాభర్తలలో ప్రతి ఒక్కరూ తోటివాని అవసరాలను మరియు సమర్ధతను పరిగణ లోనికి తీసుకోవాలి. అవసరమైతే ఒక్కోసారి తామే సర్దుబాటు చేసుకుని తోటివానికి సంతోషాన్ని ఇవ్వడానికి పరస్పరం ప్రయత్నించాలి. అంతేగాని ఎప్పుడూ తమ హక్కులన్నీ రాబట్టుకోవాలని మాత్రమే ప్రయత్నించడం తగదు. వాస్తవానికి, దంపతులిద్దరిలో ఎవ్వరూ తోటి సహవాసి హక్కులన్నింటినీ పూర్తి చేయలేరు మరియు సహవాసిని పూర్తిగా సంతోష పెట్టనూ లేరు. కాబట్టి, వారిద్దరూ తమలోని లోపాలను మరియు కొరతలను గుర్తించి, వాటిని మనస్ఫూర్తిగా ఒప్పుకోవలెను.

తమ భార్యలను ఉత్తమంగా చూసుకోవాలని ప్రత్యేకంగా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం భర్తలకు ఉపదేశించి ఉన్నారు – బహుశా అది భర్త యొక్క సాధారణ ఆధిపత్యం వలన కావచ్చు లేదా అతని అధిక శక్తి వలన కావచ్చు. ప్రవక్త

1 ఖుర్ఆన్ లోని అల్లాహ్ ఆదేశం ఇలా ఉంది, “మీరు పరస్పరం కలుసుకున్న తర్వాత, ఆ భార్యలు మీ నుండి గట్టి వాగ్దానం తీసుకున్న తర్వాత కూడా ఆ ధనాన్ని మీరెలా (వెనక్కి) తీసుకుంటారు?” (ఖుర్ఆన్ 4:21).

ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశం: "ఎవరైతే తన కుటుంబంతో (భార్యలతో) ఉత్తమంగా ప్రవర్తిస్తారో, వారే మీరందరిలో ఉత్తములు మరియు నేను నా కుటుంబం కొరకు మీరందరి కంటే ఉత్తముడిని." (అత్తిర్మిధీ మరియు ఇబ్నె మాజహ్)

వాస్తవానికి భార్యాభర్తలలో ఏ ఒక్కరూ సాధారణంగా తోటి జీవిత భాగస్వామి హక్కులన్నింటినీ పూర్తి చేయలేరని ఇంతకు ముందే చర్చించుకున్నాం. కాబట్టి, ఎదుటివానిలోని లోపాన్ని విమర్శించే లేక కఠినంగా విమర్శించే ముందు, స్వయంగా ఆత్మపరిశీలన చేసుకుని, తనలోనూ ఉన్న లోపాలను, తప్పులను ఒకసారి పరిశీలించుకోవలెను.

భార్యాభర్తలలో ఒకరి నుండి మరొకరు సరిగ్గా ఏమి కోరు కుంటున్నారో అర్థం చేసుకునేందుకు మరియు మంచి జీవిత భాగస్వామిగా జీవించేందుకు ఏమి చేయాలో గ్రహించేందుకు వీలుగా ఇస్లామీయ ధర్మశాస్త్రం దంపతులిద్దరిపై కొన్ని పరస్పర హక్కులు మరియు బాధ్యతలు స్పష్టంగా నిర్దేశించింది. ఉదాహరణకు, దివ్యఖుర్ఆన్ లోని ఈ వచనాలు :

"...భర్తలకు భార్యలపై హక్కులున్నట్లే, భార్యలకు కూడా భర్తలపై సముచితైన హక్కులున్నాయి ...." (ఖుర్ఆన్ 2:228)

**క్లుప్తంగా, భార్య యొక్క హక్కులు లేదా భర్త యొక్క బాధ్యతలలో ఇతర అంశాలతో పాటు ఈ క్రిందివి కూడా ఉన్నాయి:**

01 తగిన వధుకట్నం (మహర్) చెల్లించడం:

అల్లాహ్ ఆజ్ఞ ఇలా ఉంది:

“స్త్రీలకు వారి మహర్ సొమ్ముని మనస్ఫూర్తిగా ఇవ్వండి. ఒకవేళ వారు గనక తమ ఇష్టపూర్వకంగా మహర్ లో కొంత మొత్తాన్ని వదిలి పెడితే సంతోషంగా దాన్ని అనుభవించండి.” (ఖుర్ఆన్ 4:4)

02 భర్త పూర్తిగా భార్యను పోషించడం మరియు ఆమె ఖర్చులు భరించడం:

అల్లాహ్ ఆజ్ఞ ఇలా ఉంది:

“పురుషులు స్త్రీలపై ఒకింత ఆధిక్యత కలిగి ఉన్నారు. ఎందుకంటే అల్లాహ్ ఒకరికి ఇంకొకరిపై విశిష్ఠతను ప్రసాదించాడు. అదీ గాక పురుషులు తమ సంపదను (వారిపై) ఖర్చు పెడతారు. కనుక గుణవంతురాలైన స్త్రీలు విధేయులై ఉంటారు. తమ భర్తలు (ఇంటిలో) లేని సమయంలో అల్లాహ్ సంరక్షణలో ఉంటూ, (తమ శీలాన్నీ, భర్త సంపదను) కాపాడతారు. ఏ స్త్రీలు అవిధేయతకు పాల్పడతారని మీకు భయం ఉందో, వారికి నచ్చజెప్పండి. ...” (ఖుర్ఆన్ 4:34)

అంతేగాక బుఖారీ మరియు ముస్లిం హదీథు గ్రంథాలలో నమోదు చేయబడిన ఒక హదీథులో, తన భర్త (అబూ సుఫ్యాన్) పిసినారితనం గురించి తెలిపి, తన స్వంత ఖర్చులకు ఏమీ ఇవ్వడం లేదని ఫిర్యాదు చేసి, భర్తకు చెప్పకుండా భర్త సంపదలో నుండి తన ఖర్చుల నిమిత్తం కొంత డబ్బు తీసుకోవచ్చా అని అడిగిన హింద్ బిన్తె ఉత్బహ్

ప్రశ్నకు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా జవాబిచ్చారు: "సాంప్రదాయం ప్రకారం నీ ఖర్చులకు మరియు నీ బిడ్డ ఖర్చులకు, ఎంత అవసరమో, అంత తీసుకో."

**03** సముచితమైన రీతిలో, దయతో ప్రవర్తించడం:

అల్లాహ్ ఆజ్ఞ:

"...వారితో ఉత్తమరీతిలో కాపురం చేయండి. ఒకవేళ వారు మీకు నచ్చకపోతే బహుశా ఏదో ఒక్క విషయం మూలంగా మీకు నచ్చి ఉండక పోవచ్చు. కానీ మీకు నచ్చని ఆ విషయంలోనే అల్లాహ్ అపారమైన శుభాన్ని పొందుపరచాడేమో." (ఖుర్ఆన్ 4:19)

**04** సంభోగం :

సహీహ్ ఇబ్నె హిబ్బాన్ గ్రంథంలో క్రింది ఉల్లేఖన నమోదు చేయబడింది:

తన భర్తకు స్త్రీల అవసరం లేదని ఉథ్మాన్ ఇబ్నె మధూన్ భార్య ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఫిర్యాదు చేసింది. పగటి పూట ఆయన ఉపవాసం ఉంటారు మరియు రాత్రి పూట ఆయన నమాజులో నిమగ్నమై ఉంటారు. అపుడు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అతడిని ఇలా ప్రశ్నించారు, "నీవు అనుసరించవలసిన ఉత్తమ ఆదర్శవంతుడిని కాదా నేను?" దానికి అతడు, "నిశ్చయంగా, నా తల్లిదండ్రుల ప్రాణాలు మీకు అర్పితం అవుగాక." అపుడు అల్లాహ్ యొక్క ప్రవక్త అతడితో ఇలా పలికారు, "ఇక నీ

విషయానికి వస్తే, నీవు రాత్రంతా నమాజులో నిమగ్నమై ఉంటున్నావు మరియు పగలంతా ఉపవాసం ఉంటున్నావు. నిశ్చయంగా, నీ భార్యకు నీపై హక్కు ఉంది. నీ శరీరానికి నీ పై హక్కు ఉంది. కాబట్టి, నమాజు చేయి మరియు నిద్రపో. ఒక్కోరోజు ఉపవాసం ఉండు మరియు మరో రోజు ఉపవాసం ఉండవద్దు."

05 'ఏకాంతం, గోప్యం' :

ఈ క్రింది హదీథును పరిశీలించండి:

"తన భార్య వద్దకు వెళ్ళి, తలుపులు మూసి, కప్పుకుని మరియు అల్లాహ్ వారి పనిని దాచినట్లుగా వారు తాము చేసే పనిని దాచే మగవారు మీలో ఎవరైనా ఉన్నారా?" అపుడు వారు, "ఉన్నారు" అని జవాబిచ్చారు. తర్వాత ఆయన, "తన స్నేహితుల మధ్య కూర్చుని, (నా భార్యతో) 'నేను ఇలా చేసాను, నేను అలా చేసాను' అని చెప్పేవారు ఎవరైనా ఉన్నారా?" దానికి వారేమీ జవాబివ్వకుండా నిశ్శబ్దంగా ఉండిపోయారు. అపుడు ఆయన స్త్రీల వైపు తిరిగి, "మీలో ఎవరైనా అలాంటి విషయాల గురించి చర్చించుకుంటారా?" దానికి వారు కూడా ఏమీ జవాబివ్వకుండా నిశ్శబ్దంగా ఉండిపోయారు. అపుడు ఒక బాలిక తన బొటన వ్రేళ్ళపై నడుస్తూ, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కంటబడి, తన మాటలను వినిపించాలని విశ్వప్రయత్నం చేస్తూ, ఇలా పలికింది, "ఓ అల్లాహ్ యొక్క ప్రవక్తా, నిశ్చయంగా వారు [మగవారు] అలాంటి విషయాల గురించి చర్చించు కుంటారు మరియు

వారు (స్త్రీలు) కూడా అలాంటి విషయాల గురించి చర్చించు కుంటారు." అపుడు ఆయన ఇలా పలికారు, "అలాంటి వారు దేనిని పోలి ఉంటారో నీకు తెలుసా? అలాంటి వారు 'ఒక ఆడ దయ్యం రోడ్డు మీద ఒక మగదయ్యాన్ని కలిసి, ప్రజలు చూస్తుండగానే నడిరోడ్డు మీద తమ కోర్కెను తీర్చుకునే ఆ దయ్యాలను పోలి ఉంటారు."(1)

06 ఇస్లామీయ ధర్మం గురించి నేర్పటం మరియు నేర్చుకోవడం.

**మరో వైపు, భర్త యొక్క హక్కులు లేదా భార్య యొక్క బాధ్యతలలో క్రింది విషయాలు ఉన్నాయి:**

01 ఇంటి యజమాని:

అల్లాహ్ ఆజ్ఞ:

"పురుషులు స్త్రీలపై ఒకింత ఆధిక్యత కలిగి ఉన్నారు. ఎందుకంటే అల్లాహ్ ఒకరికి ఇంకొకరిపై విశిష్ఠతను ప్రసాదించాడు. అదీ గాక పురుషులు తమ సంపదను (వారిపై) ఖర్చు పెడతారు. కనుక గుణవంతురాలైన స్త్రీలు విధేయులై ఉంటారు. తమ భర్తలు (ఇంటిలో) లేని సమయంలో అల్లాహ్ సంరక్షణలో ఉంటూ, (తమ శీలాన్నీ, భర్త సంపదను) కాపాడతారు. ఏ స్త్రీలు అవిధేయతకు పాల్పడతారని మీకు భయం ఉందో, వారికి నచ్చజెప్పండి. ..." (ఖుర్ఆన్ 4:34)

సాధారణంగా ఇది భర్త హక్కుగా పేర్కొనబడినా, వాస్తవానికిది అతడి భుజస్కంధాలపై పెట్టబడిన ఎంతో బరువైన బాధ్యత.

1 అబూ దావూద్.

మరోమాటలో తన కుటుంబానికి దారి చూపే మరియు సన్మార్గంపై నడిపే గురుతర బాధ్యత అతడిపై ఉంచబడింది.

02 విధేయత చూపబడవలసిన హక్కు:

ఇది మొదటి హక్కుతో పాటే ఉంది. ఎవరైనా తగిన అధికారం లేకుండా ఎలా అధిపతి కాగలరు ?

03 సంభోగానికి రమ్మనే అతడి పిలుపుకు భార్య స్పందించడం.

04 భర్త సమ్మతించిన వారిని తప్ప, భార్య ఇంకెవ్వరినీ ఇంటిలోనికి అనుమతించకూడదు.

సహీహ్ బుఖారీ మరియు సహీహ్ ముస్లింలో నమోదు చేయబడిన ఒక హదీథులో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు: "అతడు సమ్మతించినవారిని తప్ప, ఇంకెవ్వరినీ అతడి ఇంటిలోనికి అనుమతించవద్దు."

ఒకవేళ భార్యాభర్తలు అల్లాహ్ మెప్పు పొందాలి మరియు పరస్పరం సుఖసంతోషాలు పంచుకోవాలి, దంపతులుగా తమ తమ పాత్రలు మరియు బాధ్యతలు గుర్తించి, సరైన ఇస్లామీయ ప్రవర్తనతో ఒకరిపై మరొకరు గౌరవాభిమానాలు చూపుకోవాలి మొదలైన మంచి ఉద్దేశ్యాలతో వివాహ బంధంలోనికి ప్రవేశిస్తే, ఇన్షా అల్లాహ్ వారి వివాహ బంధం ఇహలోకం నుండి పరలోకం వరకూ వ్యాపించి ఉండే శుభమైన పటిష్ట బంధమవుతుంది.

వివాహం గురించి పైన తెలుపబడిన విషయాలతో పాటు, ఇస్లాం ధర్మం ఒక ఆచరణాత్మక  ధర్మం అనే ముఖ్యవిషయాన్ని కూడా

మనంగుర్తించుకోవాలి.సాధారణంగాఎదురయ్యేపరిస్థితులన్నింటినీ అది పరిగణలోనికి తీసుకుంటుంది. ఉదాహరణకు ఒక పురుషుడు మరియు ఒక స్త్రీ మంచి ఉద్దేశ్యంతోనే వివాహబంధంలోనికి ప్రవేశించి ఉండవచ్చు, అయినా వారి వ్యక్తిత్వాలు పరస్పరం కలవలేక పోవచ్చు. అలాంటి అనేక సందర్భాలలో వివాహబంధం వికటించి, భార్యాభర్తలు నరకయాతనలను, క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కోవలసి రావచ్చు. ఆ పరిస్థితులలో, ఇస్లామీయ ధర్మశాస్త్రం ఆ భార్యాభర్తలు తమ వివాహ బంధాన్ని త్రెంచుకుని విడాకులు తీసుకుని, తద్వారా భార్యాభర్తలిద్దరూ బాధల నుండి విముక్తి పొందటానికి అనుమతిస్తున్నది.[1] ఇక్కడ అసలు లక్ష్యం ఏమిటంటే భార్యాభర్తలిద్దూ ప్రేమానురాగాలతో చిలకాగోరింకల్లాగా కలిసి మెలిసి స్నేహపూర్వకంగా జీవించడం లేదా మంచి పద్ధతిలో విడిపోవడం. దీని గురించి అల్లాహ్ ఆజ్ఞ ఇలా ఉంది:

"మీరు స్త్రీలకు విడాకులు ఇచ్చి నప్పుడు, వారి నిరీక్షణ గడువు (ఇద్దత్) ముగిసే వరకు వారిని సహృదయంతో మీ వద్దనే ఉంచండి. లేదంటే వారిని ఉత్తమరీతిలో సాగనంపండి. వారిపై దౌర్జన్యానికి ఒడిగట్టే ఉద్దేశ్యంతో వారిని ఆపి ఉంచుకుని వేధించకండి...." (ఖుర్ఆన్ 2:231)

అల్లాహ్ యొక్క మరో ఆజ్ఞ:

---

1 బాధాకరమైన విషయం ఏమిటంటే, ఈనాడు కొన్ని ముస్లిం సమాజాలలో విడాకులనేది సర్వసాధారణమై పోయింది. ఇస్లామీయ ధర్మ శాస్త్రం యొక్క ఈ అసలు లక్ష్యాన్ని వారు నిర్లక్ష్యం చేస్తున్నారు. తత్ఫలితంగా దంపతులిద్దరూ నిశ్శబ్దంగా బాధ పడుతున్నారు. అలాంటి సందర్భాలలో ఇదెంత మాత్రం ఇస్లామీయ ధర్మశాస్త్ర ఉద్దేశ్యం కాదనేది ప్రజలు గుర్తించాలి.

"మరి ఆ భార్యలు తమ గడువు (ఇద్దత్) పూర్తి చేసుకున్నపుడు, వారిని ఉత్తమ రీతిలో మీ వివాహబంధంలోనికి మరలా తీసుకోండి లేదా ఉత్తమరీతిలో సాగనంపండి. ..." (ఖుర్ఆన్ 65:2)

నిశ్చయంగా విడాకులను ఎవ్వరూ కోరుకోరు మరియు అది అంత తేలికైన విషయమూ కాదు. పరిపూర్ణ ప్రపంచంలోని వివాహిత జంటలన్నీ పరమ సుఖంగా ఉంటాయి. అయితే, కొన్ని సందర్భాలలో విడాకులే అందరికీ ఆమోదయోగ్యమైన ఉత్తమ పరిష్కారం కావచ్చు. కాబట్టి విడాకుల ఎంపిక కూడా కుటుంబ సంక్షేమాన్ని కాపాడే లక్ష్యంతో ఏకీభవిస్తున్నది. వివాహబంధాలన్నీ కేవలం సంఖ్యాపరంగా కలిసి మెలిసి ఉండటం కాకుండా, నాణ్యతా పరంగా కూడా ప్రేమానురాగాలతో కలిసిమెలిసి ఉండటమనేది అందరికీ అభిలషణీయం.

# సంతానం

ఖుర్ఆన్ లోని అనేక వచనాల ద్వారా తెలిసినది ఏమిటంటే సంతానం కలగటమనేది అల్లాహ్ యొక్క అనుగ్రహాలలో ఒక గొప్ప అనుగ్రహం. మానవజాతిపై తన యొక్క అనేక అనుగ్రహాలను లెక్కిస్తూ, అల్లాహ్ ఒకచోట ఇలా ప్రకటించినాడు:

"అల్లాహ్ మీ కోసం స్వయంగా మీలో నుంచే మీ భార్యలను సృష్టించాడు. మరి మీ భార్యల ద్వారా మీ కొరకు కుమారులను, మీ మనవళ్ళను పుట్టించాడు. ఇంకా మీకు తినడానికి మంచి మంచి వస్తువులను సమకూర్చాడు. అయినా ప్రజలు మిథ్యనే నమ్ము కుంటున్నారా? వారు అల్లాహ్ అనుగ్రహాల పట్ల కృతఘ్నుతకు పాల్పడుతున్నారా?." (ఖుర్ఆన్ 16:72)

కాబట్టి, ఒకచోట జకరియ్యా అలైహిస్సలాం తనకు సంతానం ప్రసాదించమని అల్లాహ్ ను వేడుకోవడం కనబడుతుంది. (ఖుర్ఆన్ 3:38). అంతేగాక సంతానం వలన తల్లిదండ్రులకు ఎంతో ఆనందం లభిస్తుంది.

అల్లాహ్ యొక్క ప్రకటన:

"సిరిసంపదలైనా, సంతానమైనా ప్రాపంచిక జీవితానికి అలంకారం మాత్రమే...." (ఖుర్ఆన్ 18:46)

అదే సమయంలో, పిల్లలను కలిగి ఉండటమనేది ఒక గొప్ప

బాధ్యతనీ మరియు అది అల్లాహ్ తరుఫున ఒక పరీక్షనీ ప్రతి తల్లీ, తండ్రీ గుర్తించాలి. అల్లాహ్ ప్రకటన:

“మీ సిరిసంపదలు, మీ సంతానం నిజానికి మీ పాలిట ఒక పరీక్ష. గొప్ప ప్రతిఫలమైతే అల్లాహ్ వద్ద ఉన్నది..” (ఖుర్ఆన్ 64:15)

అల్లాహ్ యొక్క మరో ప్రకటన,

“ఓ విశ్వాసులారా! మీరు మిమ్మల్నీ, మీ కుటుంబీకుల్నీ మనుషులు మరియు రాళ్ళు ఇంధనంగా తయారైన నరకాగ్ని బారి నుండి కాపాడుకోండి....” (ఖుర్ఆన్ 66:6)

ఇదే వచనం యొక్క భావాన్ని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తన మాటలలో ఇలా బోధించారు :

“మీరందరూ గొర్రెల కాపరులే మరియు మీరందరినీ మీ గొర్రెల గురించి ప్రశ్నించబడును. పురుషుడు తన కుటుంబానికి బాధ్యత వహిస్తాడు. అతడి బాధ్యతల గురించి ప్రశ్నించబడతాడు. తన భర్త ఇంటి గురించి మరియు ఆవిడ బాధ్యతల గురించి భార్య ప్రశ్నించబడును.”[1]

కాబట్టి, పిల్లలు కలిగి ఉండటమనేది ఒక గొప్ప అనుగ్రహంగా తెలుపుతూనే, మరో వైపు అదొక గొప్ప బాధ్యతగా గ్రహించ వలసిందని కూడా ఇస్లాం ధర్మం గుర్తు చేస్తున్నది. తల్లిదండ్రులు తమ సంతానాన్ని నరకాగ్ని నుండి తప్పించుకునేలా వీలయినంత ఉత్తమంగా తీర్చిదిద్దాలి మరియు వీలయినంత మంచిగా పెంచాలి.

1 సహీహ్ అల్ బుఖారీ, సహీహ్ అల్ ముస్లిం.

గర్భంలో ప్రవేశించటానికి చాలా కాలం ముందు నుండే తల్లిదండ్రులపై సంతానం యొక్క హక్కులు 'సరైన జీవిత భాగస్వామిని ఎంచుకోవాలనే ఆజ్ఞతో' బహిర్గత మయ్యాయని ముస్లిం పండితులు గుర్తించారు. మంచి కుటుంబ పునాది కొరకు, సంతానానికి మంచి వాతావరణం కల్పించడం కొరకు ఇది మొదటి మెట్టు. ఆ తర్వాత పుట్టగానే బిడ్డకు మంచి పేరు పెట్టడం మరియు బిడ్డ తరుఫున ఖుర్బానీ బలివ్వడం మొదలైన ఇతర ప్రధాన హక్కులు వస్తాయి[1] ఆ తర్వాత, బిడ్డ యొక్క క్రింది ఇతర ముఖ్యమైన హక్కులు వస్తాయి.:

01 సరైన ఆలనా పాలనా మరియు ఆరోగ్యవంతమైన పోషణ;

02 ఇస్లామీయ ధర్మ మూల సిద్ధాంతాలు నేర్పడం;

03 కరుణ మరియు దయతో చూడటం;

04 ఎలాంటి పక్షపాతం లేకుండా పిల్లల మధ్య న్యాయం చేయడం; మరియు

05 పిల్లల కొరకు ఒక ఆదర్శవంతమైన ఉపమానం కావడం.

1 ఈ ఖుర్బానీని అఖీఖహ్ అంటారు. దీని మాంసం పేదలలో పంచి పెట్టబడుతుంది, స్వయంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు ఇరుగు పొరుగువారు కూడా భుజిస్తారు. (ఇస్లాం రెలీజియన్).

# ఇతర బంధువులు

కుటుంబ పరిధిలో తోబుట్టువులు మరియు ఇతర రక్తసంబంధీకులు కూడా వస్తారు. నిశ్చయంగా ఒక వ్యక్తి యొక్క ఏ రక్తసంబంధీకుడినీ ఇస్లాం ధర్మం నిర్లక్ష్యం చేయలేదు. రక్తసంబంధీకులను మంచిగా, దయతో చూడవలసిన ఆవశ్యకత గురించి ఖుర్ఆన్ లో అనేక చోట్ల అల్లాహ్ ఆదేశించి ఉన్నాడు. ఉదాహరణకు, అల్లాహ్ ఆదేశం:

“అల్లాహ్ ను మాత్రమే ఆరాధించండి. ఆయనకు సహవర్తులుగా ఎవ్వరినీ సాటి కల్పించకండి. తల్లిదండ్రుల పట్ల, తండ్రిలేని బిడ్డల పట్ల, నిరుపేదల పట్ల, ఆత్మీయులైన పొరుగింటివారి పట్ల, బంధువులు కాని ఇరుగుపొరుగు వారి పట్ల, ప్రక్కనున్న మిత్రుల పట్ల, బాటసారుల పట్ల, మీ ఆధీనంలో ఉన్న బానిసల పట్ల ఔదార్యంతో మెలగండి....” (ఖుర్ఆన్ 4:36)

తమ స్వంత రక్తసంబంధీకులపై ఖర్చు చేయటం గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ పలుకులు ఇలా ఉన్నాయి:

“తాము ఏమి ఖర్చు చేయాలి అని వారు నిన్ను ప్రశ్నిస్తున్నారు. మీరేం ఖర్చు చేసినా అది మీ తల్లిదండ్రుల కొరకూ, బంధువుల కొరకూ, అనాథల కొరకూ, నిరుపేదల మరియు బాటసారుల కొరకూ ఖర్చు చేయాలి....” (ఖుర్ఆన్ 2:215)

అల్లాహ్ యొక్క మరో ఆదేశం:

"మీరు మీ ముఖాలను తూర్పు దిక్కుకో, పడమర దిక్కుకో తిప్పటమే అల్ బిర్ర్ (సదాచరణ) కాదు. అల్ బిర్ర్ అంటే వాస్తవానికి అల్లాహ్ ను, అంతిమదినాన్ని, దైవదూతలను, దైవగ్రంథాలను, దైవప్రవక్తలను విశ్వసించటం. ధనప్రీతి ఉన్నప్పటికీ, దగ్గరి బంధువులకు, అనాథలకు, ఆగత్యపరులకు, బాటసారులకు, యాచించే వారికి (ధనాన్ని) ఇవ్వడం, బానిసలను విముక్తి చేయడం, నమాజు స్థాపించడం, జకాతు చెల్లించడం, ఇచ్చిన మాటను నిలుపుకోవడం, లేమిలో, కష్టకాలంలో, యుద్ధ సమయాలలో సహన స్థయిర్యాలను కనబరచడం – ఇవన్నీ కలిగి ఉన్నవారే వాస్తవానికి సజ్జనులు. భయభక్తులు కలవారు కూడా వీరే...." (ఖుర్ఆన్ 2:177)

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఇలా అడిగారు:

"నన్ను స్వర్గానికి చేరువ చేసే మరియు నరకాగ్నికి దూరం చేసే ఆచరణ గురించి తెలుపుము." దానికి ఆయనిలా జవాబిచ్చారు, "అల్లాహ్ ను ఆరాధించు మరియు ఆయనకు ఎవ్వరినీ సాటి కల్పించకు. నమాజులు స్థాపించు, జకాతు ఇవ్వు మరియు రక్తసంబంధీకులతో బంధుత్వాన్ని కొనసాగించు."[1]

రక్తసంబంధాన్ని కొనసాగించడం అంటే మాటలతో, చేతలతో మరియు సంపదతో వారికి మంచి చేయడం. మంచి మాటలు పలకడం, వారిని దర్శించడం, దానధర్మాలు చేయడం మరియు వారిపై దయజూపడం మొదలైనవి ఇందులో ఇమిడి ఉంది. అంతేగాక వారిని చెడు నుండి, హాని నుండి కాపాడడం మరియు వారికి సుఖసంతోషాలు కలిగేలా చేయడం కూడా ఇందులో భాగమే.

1 సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం.

రక్తసంబంధాన్ని కొనసాగించడం అతనిపై విధిగా ఉన్న బాధ్యత అని, అది కేవలం ఒక మంచి పని మాత్రమే కాదు అనే సత్యాన్ని ప్రతి ముస్లిం తప్పకుండా అర్థం చేసుకోవాలి. ఖుర్ఆన్ లో అల్లాహ్ అలాంటి వారిని ఇలా ప్రశంసిస్తున్నాడు ...

"వేటినైతే కలిపి ఉంచమని అల్లాహ్ ఆదేశించాడో, వాటిని కలిపి ఉంచుతారు. వారు తమ ప్రభువుకు భయపడుతూ ఉంటారు. తమ నుండి కఠినంగా లెక్క తీసుకోబడుతుందేమోనని భయపడుతూ ఉంటారు." (ఖుర్ఆన్ 13:21)

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా పలికారు:

"బంధుత్వాన్ని త్రెంచుకున్నవాడు స్వర్గంలో ప్రవేశించడు."[1]

ప్రతి రక్తసంబంధాన్ని, కుటుంబ సంబంధాన్ని సాధ్యమైనంత ఉత్తమంగా కొనసాగించమని ఇస్లాం ధర్మం నొక్కి పలుకుతున్నది. తల్లిదండ్రుల, పిల్లల, భార్యాభర్తల మరియు ఇతర రక్తసంబంధీకుల మధ్య ఉండవలసిన గట్టి బంధం యొక్క ప్రాధాన్యత వైపు ఇస్లాం ధర్మం మార్గదర్శకత్వం వహిస్తున్నది. ప్రతి ముస్లిం ఈ రక్తసంబంధాలను కొనసాగించవలెనని ఇస్లాం నొక్కి చెబుతున్నది. బదులుగా వారు అల్లాహ్ మెప్పును పొందగలరు. అంతేగాక, (ఈ చిరు పుస్తకంలో పూర్తిగా నొక్కి చెప్పబడలేదు), తన రక్తసంబంధీకులందరితోనూ మంచి సంబంధాలు కలిగి ఉండవలసిన ఆవశ్యకతను ప్రతి వ్యక్తీ గ్రహించేలా తగిన చట్టాలను మరియు కఠినమైన నిబంధనలను ఇస్లాం ధర్మం నిర్దేశించింది.

1 సహీహ్ ముస్లిం.

IslamHouse.com

IslamHouseTe Telugu.IslamHouse/ islamhouse.com/te/

islamhousete/ IslamHouseTe/

For more details visit
www.GuideToIslam.com

GUIDE TO ISLAM

contact us :Books@guidetoislam.com

GuidetoIslam.org Guidetoislam1 Guidetoislam www.Guidetoislam.com

المكتب التعاوني للدعوة وتوعية الجاليات بالربوة

هاتف: ٩٦٦١١٤٤٥٤٩٠٠+ فاكس: ٩٦٦١١٤٩٧٠١٢٦+ ص ب: ٢٩٤٦٥ الرياض: ١١٤٥٧

ISLAMIC PROPAGATION OFFICE IN RABWAH

P.O.BOX 29465 RIYADH 11457 TEL: +966 11 4454900 FAX: +966 11 4970126

# కుటుంబ ఐకమత్యం

మన కుటుంబ వ్యవస్థ ఏ విధంగా ఉండాలి,మన జీవితంలో భాగమైన తల్లిదండ్రులు, భార్యా బిడ్డలు, తోబుట్టువులు వీరందరిలో ఐకమత్యం ఎలా ఉండాలి, సంబందాలు ఎలా ఉండాలి, శిక్షణ ఎలా ఉండాలి, వారి హక్కులేమిటి, బాధ్యతలేమిటి వంటి విషయాలు ఈ పుస్తకంలో వివరించడం జరిగింది.





IslamHouse.com
مركز أصول
Osoul Center
www.osoulcenter.com